www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 24 డిసెంబర్ 2024 | 5 | ఏలూరు

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో సోమవారం తొమ్మిది మంది తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యాసంస్థలు, బ్యాంకు ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, స్వచ్ఛంద రక్తదాతల సహకారంతో తలసేమియా చిన్నారులకు వెయ్యి నుంచి 12 వందల రక్త యూనిట్లను సరఫరా చేస్తున్నామన్నారు. తలసేమియా చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు 25 మందికి మధ్యాహ్న భోజనాన్ని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌వివిఎస్.ప్రసాద్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాదరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ జె.స్పందన, పిఆర్ఒ కెవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల గురించి పట్టించుకునే నాథుడే లేకపోయాడు. రోగుల గురించి ఏమాత్రం ఆలోచన చేయకుండా ఉన్న ఒక్క న్యూరోసర్జన్‌ను వేరే చోటకు బదిలీ చేయడంతో యాక్సిడెంట్, అత్యవసర రోగుల కోసం ఏర్పాటు చేసిన 'ట్రామాకేర్ ఐసియు' మూతపడటంతోపాటు, ఓపి సేవలు తగ్గిపోవడం, స్కానింగ్‌ల సంఖ్య పడిపోయినా జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్ దృష్టి సారిస్తేనే ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సేవలు గాడిన పడే అవకాశం ఉందని పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఇదేం సర్వజన ఆసుపత్రి..!

- న్యూరో సర్జన్‌ను పంపేసి ట్రామాకేర్ ఐసియు మూత
- యాక్సిడెంట్, అత్యవసర రోగుల పరిస్థితి అగమ్యగోచరం
- న్యూరో సేవలు లేక తగ్గిన ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్‌లు
- రోజువారీ ఓపి సేవలు 1500 నుంచి 900కు పతనం
- కలెక్టర్ పట్టించుకోకపోవడమే కారణమని విమర్శలు

న్యూరోసర్జన్ లేకపోవడంతో రోగులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న ట్రామాకేర్ ఐసియు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఏలూరు సర్వజన ఆసుపత్రికి రోగులు వస్తుంటారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు వైద్యసేవల్లో ప్రఖ్యాతిగాంచిన ఆసుపత్రి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి అధ్వానంగా మారిందని చెప్పొచ్చు. నేషనల్ హైవేపైనా, మరెక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే రెండు జిల్లాల్వాప్తంగా ఏలూరు సర్వజన ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేస్తారు. అత్యవసర కేసుల కోసం 2010లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్రామాకేర్ ఐసియు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటైంది. ట్రామాకేర్ ఐసియులో సామాన్య రోగుల కోసం పది బెడ్స్, విఐపిలకు రెండు బెడ్స్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ అత్యవసర కేసులు 20కిపైగా ఈ ఆసుపత్రికి వస్తుంటాయి. యాక్సిడెంట్ కేసుల్లో తలకు దెబ్బలు తగిలి, నరాలకు సంబంధించిన కేసులే అత్యధికంగా ఉంటాయి. ట్రామాకేర్ ఐసియు ఎక్కువగా న్యూరోసర్జన్‌పై ఆధారపడి ఉంటుంది. సర్వజన ఆసుపత్రిలో ముగ్గురు న్యూరోసర్జన్లను నియమించుకునే అవకాశం ఉన్నప్పటికీ నెల క్రితం వరకూ న్యూరో విభాగంలో డాక్టర్ రవికుమార్ మాత్రమే ఉండేవారు. కొత్త వైద్యులను నియమించుకపోగా ఉన్న న్యూరో డాక్టర్‌ను బదిలీ చేయడం గమనార్హం. వైసిపి ప్రభుత్వంలోనూ ఇలాగే జరిగితే అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జోక్యం చేసుకుని ఉన్నతాధికారులను ఒప్పించి న్యూరోడాక్టర్ కొనసాగేలా చేశారు. నెలక్రితం మరోసారి న్యూరో వైద్యునితోపాటు ఇతర వైద్యులను బదిలీ చేశారు. దీంతో సర్వజన ఆసుపత్రిలో న్యూరోసేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర కేసులు చూసే న్యూరో సర్జన్ లేకపోవడంతో ట్రామాకేర్ ఐసియు మూతపడింది. యాక్సిడెంట్, అత్యవసర కేసులను విజయవాడకు రిఫర్ చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో రోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య సైతం తగ్గిపోయింది. ముఖ్యంగా మంచానికే పరిమితమైన రోగులకు ఎన్‌టిఆర్ భరోసా కింద ప్రభుత్వం రూ.15 వేలు పింఛన్ ఇస్తోంది. అలాంటి రోగులకు మెడికల్ సర్టిఫికెట్ జారీ చేయాలంటే న్యూరోసర్జన్ తప్పనిసరి. ఆ వైద్యుడు లేక నెల రోజులుగా మెడికల్ సర్టిఫికెట్లు జారీ సైతం ఆగిపోయినట్లు చెబుతున్నారు.

సోమవారం సైతం రోగుల తాకిడి లేని ఓపి కేంద్రం

రోగుల అవస్థలు వర్ణనాతీతం

ఏలూరు సర్వజన ఆసుపత్రికి ప్రతిరోజూ వందకుపైగా న్యూరో సంబంధిత రోగులు వచ్చేవారు. న్యూరోసర్జన్ లేకపోవడంతో రోగులు సర్వజన ఆసుపత్రికి రావడం లేదు. గతంలో ప్రతిరోజూ 1500 వరకూ ఓపి ఉండగా న్యూరో డాక్టర్ లేకపోవడం, ఇతర సీనియర్ డాక్టర్లను బదిలీ చేయడంతో ఓపి సేవలు 900కు పడిపోయినట్లు సిబ్బంది మాటల్లో తెలుస్తోంది. ఎంఆర్ఐ, సిటీస్కానింగ్‌లు ఎక్కువగా తలకు, నరాలకు సంబంధించినవే ఉంటాయి. న్యూరో డాక్టర్ లేకపోవడంతో రోజుకు 35 వరకూ జరిగే ఎంఆర్ఐ స్కానింగ్‌లు 15 నుంచి 20లోపునకు తగ్గిపోయాయి. గతంలో సిటీస్కాన్‌లు ప్రతిరోజూ 50 నుంచి 60 వరకూ జరగ్గా ప్రస్తుతం 20 నుంచి 25కు పడిపోయిన పరిస్థితి ఉంది. రోగులకు మరిన్ని సేవలందించాల్సిన సర్వజన ఆసుపత్రి రోగులను దూరంగా నెట్టేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రయివేటు ఆసుపత్రులతో కుమ్మక్కై న్యూరోసర్జన్‌ను ఇక్కడ లేకుండా చేశారా అనే అనుమానాలు జనాల్లో నెలకొన్నాయి. కొత్తన్యూరో వైద్యులను నియమించకపోవడం, ఉన్న వైద్యుడిని పంపేయడం చూస్తే ప్రజల అనుమానాలకు బలం చేకూరుతోంది. సర్వజన ఆసుపత్రికి వచ్చే న్యూరో కేసులన్నీ ప్రస్తుతం ప్రయివేటు ఆసుపత్రులకే వెళ్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్య ప్రజానీకంపై పెనుభారం పడుతోంది. కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదనే చర్చ సాగుతోంది. జిల్లా ఆసుపత్రి కాస్తా సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత అక్కడ పనిచేసే ముఖ్య అధికారులంతా తాము ఇక్కడ ఎవరికీ సమాధానం చెప్పనవసరం లేదనే ధోరణిలోలో ఉన్నట్లు చర్చ సాగుతోంది. సూపరింటెండెంట్‌ను కలవాలన్నా పెద్ద ప్రహసనంగా మారింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తే తప్ప ప్రజలకు వైద్యసేవలు సరిగ్గా అందే పరిస్థితి లేదు. కొత్త న్యూరో వైద్యులను నియమిస్తారా.. లేక బదిలీ చేసిన డాక్టర్‌ను వెంటనే వెనక్కి రప్పిస్తారోగాని వెంటనే వైద్య సేవలు పునరుద్ధరించాలని జనం కోరుతున్నారు. జిల్లాలో మంత్రులు, ఎంఎల్ఎలు సైతం సర్వజన ఆసుపత్రి గురించి పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నూతన మార్కెట్ చట్టం ముసాయిదా రద్దు చేయాలి

ఎస్‌కెఎం ఆధ్వర్యాన నిరసనలు

ముసాయిదా కాపీలను దహనం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్కెట్ చట్టం ముసాయిదాను తక్షణం రద్దు చేయాలని, రైతు ఉద్యమంపై నిర్బంధ చర్యలు ఆపాలని, రైతు సంఘాలతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని, రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఏలూరులో నిరసన చేపట్టారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రైతు, కార్మికసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర నూతన వ్యవసాయ మార్కెట్ చట్టం ముసాయిదా కాపీలను దహనం చేసి కేంద్ర ప్రభుత్వ నిర్బంధ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధర గ్యారెంటీ చట్టం, రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం (అన్నే భవనం) రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం (స్ఫూర్తి భవనం) రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోరండ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎఐకెకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు డిహెచ్.రంగనాథం, రైతుకూలీ సంఘం (ఎపి) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కె.భాషా, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఎస్.సుందరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ సాలి రాజశేఖర్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. నూతన జాతీయ మార్కెట్ విధానం పేరుతో ఢిల్లీ రైతు ఉద్యమం ఫలితంగా రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను దొడ్డి దారిన అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే నూతన వ్యవసాయ మార్కెట్ చట్టం ముసాయిదాని రూపొందించారన్నారు. భవిష్యత్తులో మద్దతు ధరల వ్యవస్థను, ప్రజా పంపిణీ వ్యవస్థను రద్దు చేసే కుట్రలు, కుయుక్తులు కేంద్ర ప్రభుత్వం పన్నుతోందని చెప్పారు. రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే నూతన వ్యవసాయ మార్కెట్ చట్టం తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం, రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలని కోరారు. విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. దల్లేవాల్ ప్రాణాలు కాపాడాలని కోరారు. రైతు సంఘాలతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించాలన్నారు. లక్సర్ జైల్లో ఉన్న రైతులను వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో మరో రైతు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు కట్టా భాస్కరరావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, ఆర్.లక్ష్మణరావు, బద్దా వెంకట్రావు, పుప్పాల కన్నబాబు, బుగ్గల ప్రభాకర్, సాదే బాబూప్రసాద్, జె.గోపీ, పిచ్చుక ఆదిశేషు, కె.రాఘవ, శ్రీమన్నారాయణ, ఎం.రామన్న, కె.సుందర రావు, టి.బాబూరావు, మల్లిక, లత, నాని తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేతను ఆపేయాలని, జైళ్లలో ఉన్న వారిని విడుదల చేయాలని కోరుతూ దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా వేలేరులో ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనంతరం అక్కడ జరుగుతున్న రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మైసాక్షి వెంకటాచారి, కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

- నాణ్యతతో నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలి
- విభిన్న ప్రతిభావంతుల అర్జీలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలి
- కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చిన అర్జీలను సానుకూలంగా పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల నుండి అర్జీలను స్వీకరించేందుకు వేదిక కిందకు వచ్చి వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీరి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు వారి వైకల్యాన్ని గుర్తించి, సదరం ధ్రువీకరణపత్రాలను, రేషన్ కార్డు, పెన్షన్ మంజూరుకు ఆయా శాఖాధికారులతో సమన్వయం చేసుకుని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులకు కలెక్టర్ సూచించారు. సంబంధిత అర్జీలను పరిశీలించిన కలెక్టర్ వాటిపై అవసరమైన చర్యల కోసం సంబంధిత అధికారులను అక్కడికక్కడే ఆదేశాలిచ్చారు. స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు విచారణ చేపట్టి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కరరావు, దేవికరాణి పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతుల వద్దకెళ్లి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

అమిత్‌షా పదవికి రాజీనామా చేయాలి

ఉంగుటూరు మండలం చేబ్రోలులో..

ప్రజాశక్తి - ముసునూరు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పట్ల కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడారు. అమిత్‌షా తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని, ప్రధాని మోడీ మంత్రివర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు కొడవలి శ్రీనివాస్, పి.మురళీ, దాసు, మంగయ్య, శ్రీనివాస్, శోభనాద్రి, ప్రసాద్, రాజు, సాంబయ్య, కుటుంబరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: అంబేద్కర్ పట్ల అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ చేబ్రోలులోని గాంధీనగర్‌లో అంబేద్కర్ సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు మాట్లాడగా నేతలు సీరా అప్పారావు, చిలకంటి భాస్కరరావు, కొమ్మిన ఏసు, ఒంపుగడప సూరిబాబు, గోరింకల ఆదాం, రాయి సామేలు, గంజి గంగరాజు పాల్గొన్నారు.

కలిదిండి: అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. మంత్రి పదవి నుండి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్ చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. దళిత నాయకులు మద్దిరాల జోసఫ్, బోడిగడ్డ కిషోర్, పాతపాటి శాంతరాజు, కురెళ్ల కిషోర్, దాసరి అబ్రహం లింకన్, సనమండ దాసు, మన్నె రమేష్, చిన్ని పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు కూనపోము రాజారత్నం, బండి భాస్కర్ మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచి మెయిన్ సెంటర్ వరకూ నిరసన యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబరావు, గజ్జి రాజు, గుత్తుల సత్యనారాయణ, బుచ్చిరాజు, ఏసుపాదం, పొన్న రామచంద్రం, పేరుబోయిన లక్ష్మణరావు, జిఎస్.నాయుడు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌సాపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం కెవిపిఎస్, దళిత, ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను ఏకవచనంతో అవహేళన చేసి, రాజ్యాంగాన్ని కించపరిచి మాట్లాడిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తప్పించాలన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ ఫలాలు, రిజర్వేషన్లను అనుభవిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ ఎంపీలు పార్లమెంట్లో మాట్లాడకపోవటం సిగ్గుచేటన్నారు. మాల మహానాడు లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు తొర్లపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ రిజర్వేషన్లు అనుభవిస్తున్న ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పిఎస్.రావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చి మళ్లీ మనువాదంను తీసుకురావాలని పాలకులు ప్రయత్నిస్తున్నారన్నారు. వెంటనే అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో దళిత, ప్రజా, కార్మిక సంఘాలు ఐక్యంగా రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్దఎత్తున ఉద్యమిస్తాయన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు రంగా, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.రాంబాబు పాల్గొన్నారు.

వీడుతున్న మిస్టరీ..!

- డోర్ డెలివరీ డెడ్‌బాడీ పర్లయ్యదిగా గుర్తింపు
- రంగరాజు చిన్నఅల్లుడు శ్రీధర్‌వర్మ కోసం గాలింపు ముమ్మరం
- మృతుడు, ప్రధాన అనుమానితుడు నివాసం ఒకే గ్రామంలో

శ్రీధర్ వర్మ

ప్రజాశక్తి - కాళ్ల, ఉండి

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసు మిస్టరీ వీడుతోంది. డెడ్‌బాడీ ఎవరిదనేది గుర్తించడంతో పోలీసులు మంచి పురోగతి సాధించారు. ఇప్పటి వరకూ మిస్టరీగా ఉన్న మృతుని వివరాలను ఎట్టకేలకు ఛేదించగలిగారు. పార్శిల్‌లో వచ్చిన మృతదేహం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం గాంధీనగరానికి చెందిన బర్రె పర్లయ్య (40)దిగా గుర్తించారు. మృతుని మేనల్లుడు దుర్గారావు నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. పర్లయ్య కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో భార్య వేరేగా ఉంటోంది. వీరికి ఇద్దరు కుమారులు. పర్లయ్య ఒక్కడే గాంధీనగరంలో ఉంటూ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. డెడ్‌బాడీ డోర్ డెలివరీ అయిన గాదిరాజు రంగరాజు చిన్న అల్లుడు, ఈ కేసులో మొదటి నుంచి అనుమానితునిగా ఉన్న తిరుమాని శ్రీధర్‌వర్మ కూడా గాంధీనగరంలోనే నివాసం ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఇంట్లో ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో డెడ్‌బాడీని పంపిన చెక్కపెట్టె వంటిదే మరొకటి ఉండడంతో పోలీసులు ఖంగుతిన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన తిరుమాని శ్రీధర్‌వర్మ అసలు పేరు సునీల్‌వర్మగా పోలీసులు భావిస్తున్నారు. కాళ్ల మండలం ఇస్కులంకకు చెందిన మహిళను మొదటి వివాహం చేసుకున్న వర్మ తర్వాత శ్రీధర్‌వర్మగా తన పేరు మార్చుకుని ఉండి మండలం యండగండికి చెందిన గాదిరాజు రేవతిని ప్రేమ పేరుతో మభ్యపెట్టి రెండో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత మరో యువతిని వివాహం చేసుకుని ఆమెను కాళ్ల మండలం గాంధీనగరంలో ఉంచినట్లు గుర్తించారు. శ్రీధర్‌వర్మతోపాటు ఆ యువతి సైతం అదృశ్యం కావడంతో ఆటో డ్రైవర్‌కు చెక్కపెట్టె పార్శిల్ అప్పగించింది ఆమెనని పోలీసులు అనుమానిస్తున్నారు. పార్శిల్ ఇచ్చిన మహిళ ఎర్రకారులో వచ్చిందని, ముఖానికి మాస్క్ పెట్టుకుని ఉన్నట్లు ఇప్పటికే పోలీసుల దర్యాప్తులో తేలింది. గాంధీనగరంలో నివాసం ఉంటున్న వర్మ మూడో భార్య బయటికి వచ్చినప్పుడల్లా ముఖానికి మాస్క్ పెట్టుకునే ఉంటుందని, వర్మకు ఎరుపురంగు కారు ఉందని స్థానికులు చెప్పడంతో ఈ హత్య, డోర్ డెలివరీ వెనుక ప్రధాన నిందితుడు వర్మేనని పోలీసులు భావించి ఆయన కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పర్లయ్యది హత్యేనని గుర్తించారు. ఆక్వా చెరువులు తీసుకునే వర్మ ఆ చెరువులపై పని పేరుతో పర్లయ్యను తీసుకెళ్లి హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీధర్‌వర్మ వాడుతున్న మోటార్ సైకిల్, ఎరుపు రంగు కారు నంబర్లు నకిలీవని పోలీసులు గుర్తించారు. ఏదేమైనా ప్రధాన అనుమానితుడు శ్రీధర్‌వర్మ పట్టుబడితే ఈ కేసు మిస్టరీ పూర్తిగా వీడే అవకాశం ఉంది.

శ్రీధర్‌వర్మ ఆచూకీ తెలపండి: ఎస్‌పి

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో ప్రధాన అనుమానితుడు తిరుమాని శ్రీధర్‌వర్మ (సిద్దార్థవర్మ) ఫొటో, అతడు ప్రయాణించిన ఎరుపు రంగు కారు ఫొటోలను జిల్లా ఎస్‌పి సోమవారం మీడియాకు విడుదల చేశారు. శ్రీధర్‌వర్మ ఆచూకీ తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

26న మున్సిపల్ మస్టర్ పాయింట్ల వద్ద ధర్నాలు

ఏలూరు అర్బన్: మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల వద్ద, మస్టర్ పాయింట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. సోమవారం యూనియన్ నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన ఏలూరు నగరపాలక సంస్థ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ గత సంవత్సరం 16 రోజుల పాటు సమ్మె నిర్వహించామని గుర్తు చేశారు. దీనిపై గత జనవరి పదో తేదీన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలను ఏఒక్కటీ ఈ సంవత్సరకాలంలో అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మరోసారి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు సన్నద్ధమవుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి ప్రకటించాలని, ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023 జులై నుండి ఎరియర్స్ చెల్లించాలని కోరారు. ఇచ్చిన హామీల అమలుకు జిఒలు ఇవ్వాలని కోరారు. యూనియన్ నేత ఎ.జాన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 26, జనవరి 3, 10వ తేదీల్లో జరిగే ధర్నాల్లో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. సమావేశంలో వాటర్ వర్క్స్ యూనియన్ నాయకులు వినుకొండ రమేష్, కె.సత్యనారాయణ, పారిశుధ్య విభాగం నాయకులు బి.వెంకటేశ్వరరావు, పి.విష్ణు, కాళిదాసు, హనుమంతరావు పాల్గొని మాట్లాడారు.

క్రిస్మస్ సందడి

నూజివీడులో..

చింతలపూడిలో..

బుట్టాయగూడెంలో..

27న ఎస్‌సి వర్గీకరణ ఏకసభ్య కమిషన్ పర్యటన

ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల్లో ఉప-వర్గీకరణపై విచారణకు నియమించిన ఏకసభ్య కమిషన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్‌మిశ్రా ఈ నెల 27న జిల్లాలో పర్యటించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జెడి వి.జయప్రకాష్ తెలిపారు. 27వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏలూరు కలెక్టరేట్ గోదావరి మీటింగ్ హాల్‌లో జిల్లా యంత్రాంగం, వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని షెడ్యూల్ కులాలకు సంబంధించిన వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుండి వినతులు స్వీకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందని చెప్పారు.

ఏజెన్సీ భూవివాదాలను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ

ప్రజాశక్తి - పోలవరం

ఏజెన్సీ ప్రాంతంలోని భూవివాదాలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం మండల కమిటీ సమావేశం బొరగం భూచంద్రరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీలో ఎల్‌టిఆర్, 1/70 చట్ట ప్రకారం గిరిజనులకు చెందాల్సిన భూములను గిరిజనేతరులు అక్రమంగా అనుభవిస్తున్నారన్నారు. ఏజెన్సీలో భూవివాదాలు తలెత్తినప్పుడు రెవెన్యూ అధికారులు ఇరుపక్షాల రికార్డులు, టైటిల్ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో అధికారులు ఈ వివాదాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అటవీహక్కుల చట్టం వచ్చి ఏళ్ల గడుస్తున్నా పోడు వ్యవసాయం చేస్తున్న ఆదివాసీలకు హక్కు పట్టాలివ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో సత్యసాయి మంచినీటి పైపులు మరమ్మతులకు గురై తాగునీటి సమస్య ఏర్పడిందని, ప్రభుత్వం తక్షణమే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నేతలు తామా బాలరాజు, మడివి చలపతిరావు, సముద్రాల సాయికృష్ణ, పి.కుమారి, టి.శాంతి, గోకూరి పాండవులు, కె.పోసిరత్నం పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు శ్రీనివాస రామానుజన్

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు

ప్రతి విద్యార్థి శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపల్ ఆర్‌వి.నాగ రాజు అన్నారు. ముదినేపల్లిలో లిటిల్ ఫ్లవర్ స్కూలు లో గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభతో తయారు చేసిన అనేక ప్రాజెక్టులు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. వైస్ ప్రెసిడెంట్ చిట్టూరి నితిన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నిజ జీవితంలో మ్యాథ్స్‌తో సంబంధం ఉంటుందని, మ్యాథ్స్ పట్ల భయాన్ని వీడి ఇష్టంతో సాధన చేస్తే చరిత్ర సృష్టించగలరని విద్యార్థులకు తెలిపారు. భవిష్యత్తులో గణితం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు నితిన్ వివరించారు.

అనారోగ్యంతో సర్పంచి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

విజయ శ్యామలత (ఫైల్)

మోకాస కల్వపూడి సర్పంచి బొప్పన విజయ శ్యామలత అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. 2021 ఫిబ్రవరిలో నిర్వహించిన సర్పంచి ఎన్నికల్లో గెలుపొంది విజయ శ్యామలత సర్పంచిగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తనదైన ముద్ర వేసుకున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ఆమె భర్త బొప్పన జగదీష్ టిడిపి గ్రామ అధ్యక్షుడిగా తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు. శ్యామలత మృతితో భర్త, కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె మృతదేహాన్ని గ్రామానికి చెందిన ప్రముఖులు, పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు సందర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంస్కరణలకు ఆద్యుడు పివి.నరసింహారావు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

భారతదేశంలో సంస్కరణలకు ఆద్యుడు భారతరత్న, కీర్తిశేషులు పివి.నరసింహారావు అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గాంధీ సెంటర్‌లో పివి.నరసింహారావు 20వ వర్థంతి కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, భాషా కోవిదుడు పివి నరసింహారావు దేశాభివృద్ధిలో, రాజకీయాల్లో తనదైన చరిత్రను లిఖించారన్నారు. ప్రధానమంత్రి పదవి చేపట్టిన దక్షిణ భారత తొలి వ్యక్తిగా చరిత్రకెక్కారన్నారు. గాంధీ, నెహ్రూల ఆశయాలకు అనుగుణంగా పివి.నరసింహారావు సుస్థిర పాలన అందించారన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువ గట్టు వెంబడి బాదంపూడి, వెల్లమిల్లిలో పశు వులుపాకలు, గడ్డివాములు, ఇతర ఆక్రమణలను పంచాయతీ కార్యదర్శులు పోలీసు ప్రొటెక్షన్ సాయంతో సోమవారం తొలగించారు. ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్, ఇఒపిఆర్‌డిఒ చంద్రశేఖర్‌లు పర్యవేక్షించారు. కాలువ గట్టు వెంబడి ఆక్రమణలపై లోకాయుక్తలో కేసు కారణంగా అధికారులు ఈ ఆక్రమణలను తొలగించారు. దశలవారీగా ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరంలో కాలువ ఇరుపక్కల ఆక్రమణలను తొలగించేందుకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

650 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

దుప్పట్లు పంపిణీ చేస్తున్న అభిషేక్‌బాబు

మానవ సేవే మాధవ సేవ అని స్వచ్ఛ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచి పెండ్యాల మల్లిబాబు తనయుడు అభిషేక్‌బాబు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో సోమవారం అభిషేక్ బాబు యూత్ ఆధ్వర్యంలో వృద్ధులకు 650 రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమన్నారు. ఇప్పటికే స్వచ్ఛ సేవ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. చలికాలంలో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి సాయం అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుండె పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని అర్జీ

ఉంగుటూరు: నారాయణపురంలో వారపు సంత నిర్వహణకు సరైన స్థలం లేక ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, జాతీయ రహదారి పక్కన పంచాయతీకి చెందిన భూమిలో సొంత నిర్వహణ కోసం భూమిని కేటాయించాలని మీకోసంలో ఆర్జీ అందింది. నారాయణపురానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు మెండ్యాల నాగేశ్వరరావు మీకోసంలో ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాల్లో ఉన్న రైతు వారి సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ కె.వెంకటరమణ అన్నారు. మండలంలోని చిల్లబోయినపల్లి సచివాలయం వద్ద సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు ఎన్.మస్తాన్‌రావు, పి.నవీన్, హనిబాబు, హరిబాబు, యశోద, విజయకుమారి, మహేంద్ర, ఎస్.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ డి.ప్రశాంతి పాల్గొని మాట్లాడుతూ భూముల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ సమస్యలను అర్జీ రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చిమటబోయిన పుల్లారావు, ఎంపిటిసి సభ్యులు చింతగుంట్ల వెంకటేశ్వరరావుగౌడ్, డిప్యూటీ రెవెన్యూ తహశీల్దార్, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆలయ సెక్యూరిటీ సిబ్బంది దాతృత్వం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ సెక్యూరిటీ సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. అనారోగ్యంతో మరణించిన సెక్యూరిటీ గార్డు కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆలయంలో సెక్యూరిటీగా పనిచేస్తున్న కామవరపుకోట గ్రామానికి చెందిన శివరామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి ద్వారకాతిరుమల ఆలయ సెక్యూరిటీ సిబ్బంది మానవత్వంతో రూ.35 వేలు కుటుంబ సభ్యులకు అందించారు.

27న నిరసన ర్యాలీ : వైసిపి

ప్రజాశక్తి - ఏలూరు

విద్యుత్ ఛార్జీల పెంపుపై ఈ నెల 27వ తేదీన నిరసన తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు తెలిపారు. ఏలూరులోని వైసిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీలు, అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైసిపి అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు ఈనెల 27వ తేదీన ఏలూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ శ్రేణులు ప్రజలతో సంయుక్తంగా ర్యాలీగా వెళ్లి ఎఇకి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని పి.కన్నాపురం గ్రామపంచాయతీలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.25 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. పి.కన్నాపురం పంచాయతీకి ప్రత్యేక నిధులు కేటాయించిన గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజుకు, టిడిపి మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణకు కన్నాపురం గ్రామ పంచాయతీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పీసా గ్రామసభలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలవ్యాప్తంగా ఉన్న 12 పంచాయతీల్లో గిరిజన ప్రజలకు అవగాహన కోసం మంగళవారం పీసా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పోలవరం : మండలంలో పీసా గ్రామ సభలు నిర్వహించి పంచాయతీల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముదినేపల్లి: మండలంలోని వి.రావిగుంట గ్రామానికి చెందిన బొడ్డు శ్రీధర్ (35) కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ అంబుల మనోజ్‌కు ఈ విషయం తెలిపారు. దీంతో సోమవారం డాక్టర్ మనోజ్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు.

విద్యార్థులకు పలు పోటీలు

ఉంగుటూరు: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా నారాయణపురం గీతాంజలి పాఠశాల విద్యార్థులకు సోమవారం పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించామని ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం సెలవురోజు కావడంతో సోమవారం విద్యార్థులతో గణిత దినోత్సవంపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

పెండింగ్ జీతాలు చెల్లించకపోతే సమ్మె

చింతలపూడి : ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే జమ చేయాలని, లేకపోతే మంగళవారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా అందరూ సమ్మెలోకి వెళ్తారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.బాబు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రి వద్ద నాలుగోరోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేని పక్షంలో రేపటి నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ ప్రశ్నా పత్రాలు

ప్రజాశక్తి - మండవల్లి

యుటిఎఫ్ మోడల్ పరీక్షా పత్రాలతో విద్యార్థులు

విద్యార్థుల, విద్యాభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి యుటిఎఫ్ శాఖ విద్యార్థులకు అవసరమయ్యే పదో తరగతి మోడల్ పరీక్ష పత్రాలను వితరణగా అందించడం అభినందనీయమని విద్యాశాఖాధికారి-1 రామారావు అన్నారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పూర్వపు విద్యార్థి అయ్యవారిరుద్రవరం హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిగిరి పిచ్చోడు ఆర్థిక సహాయంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు అందించారు. ఈ స్టడీ మెటీరియల్లను ఎంఇఒ రామారావు చేతుల మీదుగా సోమవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో మరింత రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే సదుద్దేశంతో స్టడీ మెటీరియల్ అందించినట్లు చెప్పారు. అనంతరం మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులకు, ఇంగిలంపాకలంక జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలలో 20 మంది విద్యార్థులకు సుమారు రూ.11 వేల విలువైన యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్లను, పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ ఆర్.రవికుమార్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.రమేష్, జిల్లా కార్యదర్శి ఎం.రవిశంకర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో అర్జీదారుల కోసం పలు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వినతులిచ్చేందుకు వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం కలెక్టర్ కె.వెట్రిసెల్వి పలు ఏర్పాట్లు చేశారు. అర్జీదారుల కోసం కుర్చీలు, తాగునీటి సౌకర్యాలు కల్పించారు. అర్జీదారుల సౌకర్యార్థం పలు సూచనలతో బ్యానర్ ఏర్పాటు చేశారు. ఫించన్ల విషయమై వారి సౌకర్యార్థం ఫించన్ల సహాయ సేవా కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చిన అర్జీలను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక రిసెప్షన్ కౌంటరును, వారి సమస్యలకు సంబంధించి అర్జీలను రాసేందుకు సహాయ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. వికలాంగుల కోసం మూడు చక్రాల సైకిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, ప్రథమ చికిత్సాకేంద్రం, మరుగుదొడ్ల ఏర్పాట్లను చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చిన వారికి తేనీరు(టీ) అందించే ఏర్పాటును కూడా చేశారు.

వినియోగదారుల చట్టంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి -ఏలూరు

నగరంలోని శ్రీ శార్వాణి పబ్లిక్ స్కూల్‌లో జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా కొవ్వలి వినియోగదారుల సేవామండలి ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టం-2019పై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన హెచ్ఎం మురళీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి వస్తు సేవల కొనుగోలు, వ్యవహారాల్లో ప్రశ్నించే మనస్తత్వం ఉండాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాన్ఫిడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్స్ అసోసియేషన్ (సెడ్కాస్)కన్వీనర్ సీనియర్ న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారుడిగా నష్టపోతే వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్స్‌లో ఫిర్యాదు చేసి వస్తు సేవల ధరలు తిరిగి పొందవచ్చన్నారు. నష్టపరిహారం కూడా పొందవచ్చన్నారు. వినియోగదారుల వివాదాల పరిష్కారానికి వినియోగదారుల చట్టం-2019 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెడ్కాస్-కో కన్వీనర్, సీనియర్ న్యాయవాది సిపిఎస్.రామానుజాచార్యులు మాట్లాడుతూ మోసం చేసే వారిపై తూనికలు కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కస్తూరి మాట్లాడుతూ విద్యార్థులు కల్తీ లేని వస్తువులు కొనుగోలు చేయాలని చెప్పారు. అడ్వకేట్ జోసెఫ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌరుహక్కులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వై.శిరీష, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి సూచించారు. ఏలూరు 40వ డివిజన్‌లోని కరణం వారి వీధిలో రూ.22 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎంఎల్‌ఎ సోమవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు సూచించారు. స్థానిక మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన తరగతుల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలో పలువురికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను అందించారు. లక్కవరంలోని టిడిపి నాయకులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొఠారి దొరబాబు గెస్ట్ హౌస్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలో లబ్ధిదారులకు రూ.55.50 లక్షల 50 చెక్కులను పంపిణీ చేశారు.

26 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మూడు రోజులపాటు వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా గుండుగొలను గ్రామ సచివాలయం-1 మొబైల్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27వ తేదీల్లో గుండుగొలను-1 అంగన్‌వాడీ కేంద్రంగా, 28వ తేదీన ఆగడాలలంక మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంగా క్యాంపులను నిర్వహించనున్నామన్నారు. పూళ్ల గ్రామ సచివాలయం-1 మొబైల్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన కురెళ్లగూడెం అంగన్‌వాడీ-1 కేంద్రంగా, 27, 28 తేదీల్లో అంబరుపేట-1 అంగన్‌వాడీ కేంద్రంగా మొబైల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. భీమడోలు గ్రామ సచివాలయం-1 మొబైల్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అర్జావారిగూడెం ఆవాస ప్రాంతంలో అంగన్ వాడీ కేంద్రం-1గా మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు

కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏసుక్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐకమత్యం సందేశాన్ని ప్రతిఒక్కరూ ఆచరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ నేతృత్వంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సెమీ క్రిస్మస్, హై టీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి తొలుత కేక్ కట్ చేసి క్రైస్తవులకు, చిన్నారులకు పంచి పెట్టారు. క్యాండిల్ వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. పలువురు చిన్నారులు శాంటాక్లాజ్ వేషధార ణలతో అలరించారు. తొలుత రెవరండ్ వి.రతన్ రాజు, బిషప్ జాన్ రాజు, పాస్టర్లు విలియం, రంజిత్ క్రీస్తు జన్మ విశిష్టత, బోధనలు,క్రిస్మస్ పండుగ గురించి తెలిపారు. ఫాస్టర్ జయరాజ్ బైబిలు గ్రంథము పఠనం చేశారు.

భీమడోలు: క్రీస్తు బోధనల్లో మంచిని గ్రహించి సన్మార్గంలో పయనించాలని భీమడోలు సిఐ యుజె.విల్సన్ సెమీ క్రిస్మస్ సందేశంగా తెలిపారు. మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కె.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం సాయంత్రం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.

ముదినేపల్లి : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం పలు ప్రయివేట్ స్కూల్స్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముదినేపల్లిలోని ఇండో సాక్షన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, గౌతమి హైస్కూల్, వివిధ గ్రామాల్లోని ప్రయివేట్ స్కూల్స్‌లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక, క్రిస్మస్ పాటలకు చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

చింతలపూడి : శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేక్ కటింగ్ చేసి విద్యార్థులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరూ వివిధ రకాల స్కిట్లు, క్రిస్మస్ పాటలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం పార్థసారధి, రీజనల్ ఇన్‌ఛార్జి ఉదయ్‌భాస్కర్, జోనల్ ఇన్‌ఛార్జి కవిత రాజేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సురేష్, అకాడమిక్ డీన్ మధుబాబు, ఎఒ రవీంద్ర, ప్రైమరి ఇన్‌ఛార్జి ఝాన్సీ, ప్రీ ప్రైమరి ఇన్‌ఛార్జి రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ఏలూరు సిటీ : ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, హైస్కూల్ ప్లస్ ప్రాంగణంలో సోమవారం విద్యార్థినిలకు యూనిఫాం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టిడిపి నాయకు రాలు తవ్వా అరుణకుమారి సౌజన్యంతో మొత్తం 60 మంది ఇంటర్ విద్యార్థినులకు సమకూర్చిన యూనిఫాంను ఎంఎల్‌ఎ చంటి అందించారు. పలు విభాగాల్లో ప్రతిభ కనపరచిన వారికి స్మార్ట్ వాచ్‌లను అందించారు. అనంతరం స్కూల్ ఉపాధ్యాయులు ఎంఎల్‌ఎ చంటికి వినతిపత్రం అందించారు. బాలికల కళాశాలను కొనసాగించాలని కోరారు. స్కూల్ పాత భవనాన్ని ఎంఎల్‌ఎ చంటి పరిశీలించారు.

సామాజిక సేవే లక్ష్యం : చింతమనేని

పెదవేగి: సామాజిక సేవే తన లక్ష్యమని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆయన మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజకీయ ప్రముఖులకు నిత్యం ఎంతో మంది శాలువాలు బహుకరించటం సర్వ సాధారణం. అయితే అలా వచ్చిన శాలువాలను నిరుపయోగంగా పడేయకుండా గివ్ బ్యాక్ కార్యక్రమం చేపట్టారు. దెందులూరు నియోజకవర్గ పరిధిలోని చిన్నారులకు ప్రత్యేకంగా వారి కొలతలు సేకరించి మరి శాలువలతో దుస్తులు కుట్టించి ఉచితంగా అందిస్తున్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన గివ్‌బ్యాక్ కార్యక్రమంలో భాగంగా తనకు బహుకరించిన శాలువాలతో దాదాపు 200 చిన్నారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కొత్త బట్టలను ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ సోమవారం ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చింతమనేని మాట్లాడుతూ చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ గివ్ బ్యాక్ కార్యక్రమం ద్వారా తనకు లభించిన శాలువాలను నియోజకవర్గంలోని అనేక సంక్షేమ హాస్టల్లో, అవసరత కలిగిన నిర్భాగ్యులైన చిన్నారులకు నూతన వస్త్రాలుగా వారి కొలతలను సేకరించి మరి కుట్టించి ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తాతా సత్యనారాయణ, మేక కనకరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

51 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కొండంగి గ్రామంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన మోషే నుంచి 51 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 239/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
కట్టా శ్రీనివాసబాలాజి అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: కట్టా శ్రీనివాసబాలాజి, S/o. వెంకటరావు, డోర్ నెం. 4-12, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల అశ్వనికుమార్, S/o. భాస్కరరావు, డోర్ నెం. 4-65, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 26-12-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 112/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
వేముల వెంకటలక్ష్మి అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, డోర్ నెం. 4-105, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల వర్ధనరావు, S/o. చిరంజీవి, డోర్ నెం. 4-105, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 27-12-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 307/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
మిద్దే రామచంద్రరావు అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: మిద్దే రామచంద్రరావు, S/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 3-57, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల సూర్యవంశీధర్, S/o. చంద్రశేఖర్, డోర్ నెం. 4-109, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 26-12-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

TADEPALLIGUDEM MUNICIPALITY
"e" Procurement Tender Notice

Roc.No.2422/E1/2023-24 **Dated.23.12.2024**

Sl. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	Providing Reparis Tractor Trucks belonging to Tadepalligudem Municipality	General Funds	12.80	24.12.2024	30.12.2024

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site https://tender.apreprocurement.gov.in

Sd/- Commissioner
Tadepalligudem Municipality.

వేలం ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) భీమవరం వారి కోర్టులో
E.P.No.6/2021
in O.S.No.231/2015

Between:
పాకలపాటి సూర్యనారాయణ ...DHR/వాది
Vs
ప్రగాడ సాయి కుమారి మరియు వగైరాలు ...JDR/ప్రతివాది

పై నెంబరు E.P గ్రంథంలో ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని ది.20-01-2025 సం॥ తేదీన పైకోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయబడును. వలయువారు వేలం పాటలో పాల్గొని సదరు ఆస్తిని పాడుకొనవచ్చును.

షెడ్యూల్

Item No.1 :
పశ్చిమ గోదావరి జిల్లా, గునుపూడి సబ్ రిజిస్ట్రి, పాలకోడేరు మండలం, విస్సాకోడేరు గ్రామ పంచాయతి ఏరియాలోని, విస్సాకోడేరు గ్రామం, రి.స.నెం.256/2A లో చిత్తు ప్లాను నెం.9, ఉత్తరం వైపు య.2-13 సెంట్లులో ఉత్తరం వైపు సగం య.1-06 1/2 సెంట్లులో చ.గ.175.25 స్థలంకు హద్దులు : **తూర్పు:** ప్లాట్ నెం.8 స్థలం 41 అ. **దక్షిణం:** 20 అడుగుల వెడల్పు గల ఉత్మడి మార్గం 37.9 అ. **పడమర :** ప్లాట్ నెం.10 స్థలం 41 అ, **ఉత్తరం :** గాదిరాజు సత్యనారాయణ రాజు గారి భూమి 38.9 అ.
పై హద్దుల మధ్య చ.గ.174.25 స్థలం మరియు సమస్త హక్కులతో సహా.
పై Item No.1 DHR విలువ Rs.2,50,000/-
అమినా విలువ Rs.6,40,000/-

Item No.2 :
పశ్చిమ గోదావరి జిల్లా, గునుపూడి సబ్ రిజిస్ట్రి, పాలకోడేరు మండలం, విస్సాకోడేరు గ్రామ పంచాయతి ఏరియాలోని, విస్సాకోడేరు గ్రామం, రి.స.నెం.256/2A లో చిత్తు ప్లాను నెం.5, ఉత్తరం వైపు య.2-13 సెంట్లులో ఉత్తరం వైపు సగం య.1-06 1/2 సెంట్లులో చ.గ.175.07 స్థలంకు హద్దులు : **తూర్పు:** ప్లాట్ నెం.4 స్థలం 43 అ. **దక్షిణం:** 20 అడుగుల వెడల్పు గల ఉత్మడి మార్గం 36.6 అ. **పడమర :** ప్లాట్ నెం.6 స్థలం 42.9 అ, **ఉత్తరం :** గాదిరాజు సత్యనారాయణ రాజు గారి భూమి 37.0 అ.
పై హద్దుల మధ్య చ.గ.175.07 స్థలం మరియు సమస్త హక్కులతో సహా.
పై Item No.2 DHR విలువ Rs.2,50,000/-
అమినా విలువ Rs.6,45,000/-
Item No.1 and 2 DHR విలువ Rs.5,00,000/-
Item No.1 and 2 అమినా విలువ Rs.12,85,000/-

అల్లూరి వెంకటేశ్వరరాజు
ప్రాంతం : భీమవరం తరపు అడ్వకేట్,
తేది.21-12-24 భీమవరం.